

పెన్షన్‌దారులపై మోడీ ప్రభుత్వం కుట్ర

ప్రజాశక్తి -పార్వతీపురం

కేంద్ర ప్రభుత్వం పెన్షన్ దారులపై కుట్ర చేస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు ఒక ప్రకటనలో చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అయిన తరువాత లభించే పెన్షన్ రివైజ్ కాకుండా చేసేందుకు మోడీ ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో బిల్లు పెట్టిందని చెప్పారు. పెన్షన్ నిబంధనలు సవరణ బిల్లును లోక్ సభలో ఆమోదించినట్లు తెలిపారు. రాజ్యసభలోనూ ఈ బిల్లు ఆమోదం పొందితే పిఆర్సీ తర్వాత ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెన్షన్ పెరిగే అవకాశం లేదన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా దీనివల్ల ముప్పు పొంచి వుంటుందని చెప్పారు. రాష్ట్ర ఎంపీలు రాజ్యసభలోనైనా ఈ బిల్లును అడ్డుకోవాలని మురళీమోహన్ రావు కోరారు.

సమస్యల ఖిల్లా...మన్యం జిల్లా



డోలిపై రోగిని తీసుకొస్తున్న గిరిజనులు (ఫైల్)

- వెంటాడుతున్న ఏనుగుల సమస్య
- కదలని జంఝావతి ప్రాజెక్టు
- ఉన్నత విద్యాసంస్థలకు దూరం
- ఇంకా కొనసాగుతున్న డోలిమోతలు
- ఐటిడిఎ క్రియాశీలతపై తీవ్ర ప్రభావం
- నేడు జిల్లా ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా అవతరించి మూడేళ్లయినా అభివృద్ధి మూడడుగుల ముందుకు, ఆరడుగుల వెనక్కి అన్నట్లు ఉంది. 15 మండలాలు, మూడు గిరిజన గిరిజన నియోజకవర్గాలు, ఒక ఎస్‌సి నియోజకవర్గంగా 2022 ఏప్రిల్ 4న జిల్లా ఆవిర్భవించింది. జిల్లా ఏర్పడిందన్న ఆనందమే తప్ప ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. వీటిలో ఎక్కువగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవించే ప్రజలు ఉన్నారు. జిల్లా ఏర్పాటైన తర్వాత ఇద్దరు కలెక్టర్లు జిల్లాను పాలించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ చేసినా కేంద్ర ప్రభుత్వం ఇంకా జిల్లాల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. దీంతో కేంద్రం దష్టిలో 13 జిల్లాలుగానే వున్నాయి. దీని వల్ల కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులు నేరుగా జిల్లాకు విడుదలయ్యే అవకాశం లేదు. ఫలితంగా అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదనే విమర్శలున్నాయి.

మసకబారిన పార్వతీపురం ఐటిడిఎ

జిల్లా ఏర్పాటైన తర్వాత పార్వతీపురం ఐటిడిఎ మసకబారింది. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారుల క్రియాశీలతపై జిల్లా ఆవిర్భావ ప్రభావం పడింది. ఫలితంగా గిరిజన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు మందగించాయని గిరిజన సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసమే ఏర్పడిన ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయం జిల్లా ఏర్పాటుకు ముందు గిరిజనులతో నిత్యం సందడిగా ఉండేది. గిరిజన సమస్యల్ని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు వెంటనే పరిష్కరించే పరిస్థితి అప్పట్లో కనిపించేది. ప్రాజెక్టు అధికారులు ఐటిడిఎని శాసించే స్థాయిలో వుండేవారు. అయితే జిల్లా ఆవిర్భావం తర్వాత పార్వతీపురం ఐటిడిఎ జిల్లా కలెక్టర్ నియంత్రణలో పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఐటిడిఎకి సంబంధించిన అన్ని అంశాల్లోనూ కలెక్టర్ జోక్యం పెరగడంతో ప్రాజెక్టు అధికారుల పాత్ర కుంచించుకుపోయినట్లు కనిపిస్తోంది. కొత్తగా ఏర్పడిన జిల్లా కావడంతో జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఇతర శాఖల జిల్లా కార్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అప్పటి నిధులు మంజూరు చేయకపోవడంతో ఐటిడిఎ నిధులపై దృష్టి మళ్ళింది. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన ఐటిడిఎ నిధులు దారిమళ్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన పార్వతీపురం సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి

కదలని జంఝావతి ప్రాజెక్టు

పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో భూములను సస్యశ్యామలం చేసే అవకాశం ఉన్న జంఝావతి ప్రాజెక్టు గత ఐదు దశాబ్దాలుగా ఊరిస్తోంది. ఎన్నికల ముందు రాజకీయ పార్టీల నాయకులు ఈ ప్రాజెక్టు నిర్మాణంపై లేనిపోని ఆశలు కల్పించి ఎన్నికైన తర్వాత నిర్లక్ష్యం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఒడిశాతో ఉన్న జలవివాదాన్ని సాకుగా చూపి పాలక పార్టీలు గత 50 ఏళ్లుగా దీన్ని నీరు గారు స్తున్నారు. ఒడిశాలో ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం అధికారంలో వుంది. అదే పార్టీ భాగస్వామ్యంతో రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. వ్యవసాయ ప్రధానమైన జిల్లాను మరింత ముందుకు నడిపించాలనే చిత్తశుద్ధి స్థానిక ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఉంటే ఇది పెద్ద సమస్యే కాదు.

గిరిజన ఉత్పత్తులకు దక్కని గిట్టుబాటు ధర

జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో అటవీ ఉత్పత్తుల సేకరణ ఎక్కువగా జరుగుతోంది. వేర్వేరు సీజన్‌ల్లో లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం లేక గిరిజనులు దళారీల చేతుల్లో చిక్కి నష్టపోతున్నారు. జీడిపిక్కలు, చింతపండు పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటవీ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమలు లేకపోవడం తో గిరిజన యువకులు దూరప్రాంతాలకు ఉపాధి కోసం వలస పోతున్నారు.



ఏజెన్సీలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

వెంటాడుతున్న ఏనుగులు

మన్యం జిల్లాను గత కొంతకాలంగా ఏనుగుల సమస్య వెంటాడుతోంది. ఒడిశా నుంచి వచ్చిన ఏనుగులు జిల్లాలో మకాం వేసి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టానికి గురి చేస్తున్నాయి. ఇతవరకు ఏనుగుల దాడుల్లో 13 మంది మరణించారు. కోట్లాదిరూపాయల పంట, ఆస్తినష్టం జరిగింది. ఇంత జరుగుతున్నా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో సంచరిస్తున్న ఏనుగులను తాత్కాలిక ఆశ్రయ కేంద్రం వద్దకు తీసుకొచ్చి వాటికి కుంకీ ఏనుగులతో శిక్షణ ఇచ్చి తరలించాలనే యోచనలో జిల్లా అటవీ అధికారులు వున్నారు. దీనిలో భాగంగా సీతానగరం గుచ్చిమి రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో ఏనుగుల తాత్కాలిక ఆశ్రయ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. మరోవైపు గుచ్చిమి రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో ఏర్పాటు చేయడం వల్ల తమ పంట ,ఆస్తులకు నష్టం వాటిల్లుతుందేమోనని సీతానగరం, పార్వతీపురం మండలాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

ఉన్నత విద్యాసంస్థలకు దూరం

జిల్లాలో ఉన్న జనాభాలో అధికశాతం మంది పేద, మధ్యతరగతి ప్రజలే. వీరిలో అత్యంత వెనుకబడిన గిరిజనులు ఉన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేని గిరిజన గ్రామాలెన్నో వున్నాయి. విద్య, వైద్యం ఇప్పటికీ అందని ద్రాక్ష లా వున్నాయి. జిల్లాలో ఉన్నత విద్యా సంస్థ ఒక్కటీ లేకపోవడంతో గిరిజన యువకులు పొరుగు జిల్లాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర విభజనలో భాగంగా ఉమ్మడి జిల్లాకు కేటాయించిన గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం మన్యం జిల్లాలో ఏర్పాటు చేయాలన్న ఆలోచన గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికీ లేదు. కురుపాంలో నిర్మాణంలో ఉన్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల ఇంకా అసంపూర్తిగా మిగిలి ఉంది. జిల్లా అవతరణ తర్వాత మంజూరైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం నత్తనడకన సాగుతోంది.



కురుపాంలో పూర్తికాని ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రతి మహిళా లక్షాధికారి కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని స్వయం సహాయక బృందాల్లోని ప్రతి మహిళ లక్షాధికారి కావాలని, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎపిడిలు, ఎపిఎంలను ఆదేశించారు. జిల్లాలో దాదాపు 2 లక్షల 30 వేల మంది మహిళా సభ్యులు ఉండగా, వారిలో సగానికి పైగా లక్ష లోపు వార్షికాదాయం ఉందన్నారు. అటువంటి వారిని గుర్తించి, వారితో అనుకూలంగా ఉండే వ్యాపారాలను చేపట్టి ప్రతి మహిళను లక్షాధికారునిగా తీర్చిదిద్దాలని అన్నారు. ఇందుకు ఎస్‌హెచ్‌జి నిధులే కాకుండా డిఆర్‌డిఎ - వెలుగు సంస్థల నుంచి సహకారం పొందవచ్చు న్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళా వ్యాపారవేత్త రావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంత మంది లక్షాధికారులు, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్ద దానికి అవకాశం ఉందో ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని అన్నారు. అందులో ప్రతి నెలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఆ దిశగా ప్రగతిని కనబరచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధి హామీలో చెరువు గట్లపై కొబ్బరి, పనస వంటి మొక్కల పెంపకం చేసుకునేందుకు వీలుందని, ఫలసాయం నుంచి వచ్చే ఆదాయాన్ని మహిళలు ఆర్జించవచ్చని అన్నారు. గ్రామాల్లో చేపల పెంపకంతో అధిక ఆదాయం లభిస్తుందని తెలిపారు. గ్రామాల్లో సామాజిక మరుగుదొడ్ల నిర్వహణను ఆసక్తి ఉన్న మహిళలతో రుసుమును వసూలు చేస్తూ నిర్వహించుకునే సౌలభ్యం ఉందన్నారు. అలాగే పశు సంవర్ధక శాఖ ద్వారా గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపకంతో అధిక ఆదాయం లభించగలదని కలెక్టర్ గుర్తుచేశారు. జీడి, పసుపు పంటల సాగుతో అధిక ఆదాయం వస్తుందని, జీడి పరిశ్రమకు అవసరమైన జీడి పిక్కలు కొనుగోలు, గిరి బజారు ద్వారా మహిళలు తయారు చేసిన వస్త్ర, ఇతర సామాగ్రి విక్రయాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల స్కూల్ యూనిఫారాలను తయారు చేయడం ద్వారా ఆదాయం సమకూరు తుందన్నారు. మార్కెట్‌లో ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని తయారు చేసి విక్రయించడం వల్ల ప్రతి మహిళ లక్షాధికారి కావచ్చని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు తగిన శిక్షణ, ముందస్తు ప్రణాళిక కచ్చితంగా ఉండాలని తేల్చి చెప్పారు. ఆర్సెటి ద్వారా మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉచితంగా శిక్షణ పొందవచ్చని, మహిళా సంఘాలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించుకొని ప్రగతిని సాధించాలని అన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ సుధారాణి, ఎపిడి వై.సత్యం నాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. ఎస్.మన్మధరావు, ఐటిడిఎ ఎపిఒ మురళీమోహన్, ఎపిడిలు, ఎపిఎంలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జగ్జీవన్‌రామ్ జయంతి

పార్వతీపురం : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 5న (శనివారం) డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక సౌందర్య థియేటర్ జంక్షన్ వద్ద ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం 10 గంటలకు సమావేశం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎస్‌సి నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

అంతర్జాతీయ పారా అథ్లెట్ (బ్లైండ్) క్రీడాకారిణి కిల్లక లలిత భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆకాంక్షించారు. తాను సాధించిన విజయాలతో జిల్లాకు మంచి పేరు వచ్చిందని, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లా పేరును ఇనుమడింప చేయాలని ఉద్బోధించారు. పారా అథ్లెట్ క్రీడాకారిణి లలిత అభినందన కార్యక్రమం జిల్లా కలెక్టరు ఛాంబరులో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమెను దుస్సాలువతో కలెక్టర్ ఘనంగా సత్కరించి, రన్నింగ్ షూస్‌ను బహూకరించారు. వైకల్యం శరీరానికే గాని మానసికంగా కాదని, ఇటువంటి వారిని ప్రోత్సహిస్తే, ఇతర క్రీడాకారులకు తీసిపోరని కలెక్టర్ కొనియాడారు. ఆమె మరిన్ని విజయాలు సాధించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం గొల్లలంకకు చెందిన లలిత తల్లిదండ్రులు బొర్జ, సీతమ్మలను కలెక్టర్ ముందుగా అభినందించారు. ఆమెలోని క్రీడా తపనను గుర్తించి, సరైన ప్రోత్సాహం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముందుగా ఆమె సాధించిన పతకాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కిల్లక లలిత క్రీడా ఆణిముత్యమని కొనియాడారు. లలతి వివిధ పాల్గొన్న సాధించిన విజయాలను, పతకాలను కలెక్టరుకు వివరించారు. 2018 నుంచి నేటి వరకు పతకాలు సాధించిన విషయాన్ని తెలిపారు. అభినందన కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.మురళీమోహన్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు డిటి గాంధీ, క్రీడాప్రాధికార సంస్థ శిక్షకులు, పీడి, పీఇటి అసోసియేషన్ల సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణి లలితను అభినందిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గిరిజనులకు తప్పని డోలిమోతలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

వైద్యం కోసం పట్టణానికి చేరుకోవాలంటే ఇంకా డోలిమోతలేనానని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిశిఖర గ్రామాల్లో ఉండే గిరిజనులకు కనీసం రోగం చేస్తే బాగు చేయించుకోవడానికి పట్టణానికి రావడానికి కూడా ఇబ్బందులు పడుతూ డోలీమోతల ద్వారా గ్రామాల నుంచి మైదాన ప్రాంతాలకు రావడానికి కిలోమీటర్ల కొద్దీ నడత రావడం బాధాకరమని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సీదరపు అప్పారావు ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని జిల్లేడువలస పంచాయతీ బొడ్డపాడు నుంచి సుమారు మూడు కిలోమీటర్లు డోలి కట్టి సీదరపు నాగేశ్వరరావును గురువారం మైదాన ప్రాంతమైన జిల్లేడువలసకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి ఆటోలో సాలూరు ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. రోగి ఆరోగ్య పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో సాలూరు ఏరియా హాస్పిటల్ నుండి విజయనగరానికి రిఫర్ చేశారు. సరైన దారి లేకపోవడంతో గిరిజనులు డోలీలతో తీసుకురావాల్సి వస్తుందని, స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు కావస్తున్నా గిరిజన ప్రాంతంలో సరైన రహదారులు లేకపోవడంతో గిరిజనులు విద్య, వైద్యం కోసం తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కారడవలస నుండి జిల్లేడు వలస వరకు 6 కిలోమీటర్లు బిటి రోడ్డు నిర్మాణం చేసి విద్య, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిచో పోరాటం చేస్తామని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు సాలూరు ఏరియా హాస్పిటల్లో నాగేశ్వరరావు పరామర్శించి, సరైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గిన్నెల రాంబాబు, సీదరపు బాలకృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



బొడ్డపాడు నుంచి డోలిపై రోగిని మైదాన ప్రాంతానికి తీసుకొస్తున్న గిరిజనులు



పట్టుబడిన గంజాయితో ఎఎస్‌పి అంకిత సురానా, పోలీసు సిబ్బంది

400 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - సాలూరురూరల్

పాచిపెంట మండలంలో 400 కేజీల గంజాయి పట్టుబడినట్టు ఎఎస్‌పి అంకిత సురాన వెల్లడించారు. గురువారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో విలేకరులతో ఆమె మాట్లాడారు. గురువారం ఉదయం నాలుగు గంటలకు పాచిపెంట మండలం ఆలూరు వద్ద గల గ్రీన్ ఫీల్డ్ హైవేలో వాహన తనిఖీలను పోలీసులు చేశారని, ఆ సమయంలో రెండు కార్లుపై వస్తున్న నిందితులు పోలీసుల తనిఖీలను గమనించి కార్లను యూ టర్న్ తీసుకొని మళ్లీ వెనక్కి వెళ్లారని తెలిపారు. ఇది గమనించిన పోలీసులు ఆ వాహనాలను వెంబడిం చగా, ఆ వాహనాలను మధ్యలో విడిచి పెట్టి చీకట్లో తప్పించుకుపోయారన్నారు. ఆ రెండు కార్లను సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి సోదా చేశామన్నారు. అందులో సుమారు 400 కేజీలు గంజాయి పట్టుబడిందని, దీని విలువ సుమారు రూ.39 లక్షలు ఉంటుందని ఆమె తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. విలేకరుల సమావేశంలో రూరల్ సిఐ పి.రామకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి, పాచిపెంట ఎస్సై వెంకట్ సురేష్ పాల్గొన్నారు.

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పాలకొండ : మండలంలోని సింగనవలస గ్రామంలో అప్పుల బాధ తాళలేక మునుకోటి చిన్నారావు (60) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడు నెలల క్రితం చిన్నారావు భార్య పుష్ప మృతి చెందింది. సుమారు రూ.4లక్షలు అప్పు ఉండడం, ఈ అప్పుతో తనకు సంబంధం లేదని కొడుకు చెప్పడంతో చిన్నారావు ఆందోళన చెందాడు. దీంతో గురువారం తన ఇంటి దగ్గర ఉన్న పశువుల శాలలో ఉరివేసుకొని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఎస్సై ప్రయోగమూర్తి సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు

భూ యజమానుల సమక్షంలోనే రీసర్వే : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

భూ యజమానుల సమక్షంలోనే రీ సర్వేను పారదర్శకంగా చేపడుతున్నట్లు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. మండలంలోని తాళ్లబురిడిలో రెండో విడత జరిగిన రీసర్వే అవగాహన ర్యాలీలో ఆయన భాగస్వామ్యమై రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైతులకు ముందుగా నోటీసులు అందించి వారి సమక్షంలోనే రోవర్ సహాయంతో ఖచ్చితమైన హద్దులను నిర్ణయించడం జరుగుతుందన్నారు. సర్వేలోని లోపాలు, ఇబ్బందులను సవరించుకునేందుకు ఇది చక్కని అవకాశమని తెలిపారు. రీసర్వే గ్రామ సభకు హాజరై, రికార్డులను స్పష్టంగా సరిచూసుకోవాలని, అవసరమైన సవరణలు చేయాలని పిఒ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఉప తహశీల్దార్, మండల సర్వేయర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ నిబంధనలను రద్దు చేయాలి

పోస్టల్ కార్యాలయం వద్ద పెన్షనర్ల నిరసన

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

కేంద్ర ప్రభుత్వం ఈనెల 25న ఆర్థిక బిల్లుల్లో భాగంగా పెన్షన్స్ నిబంధనల్లో చేసిన మార్పులు పెన్షనర్ల హక్కులకు విఘాతం కలిగించడమే కాకుండా ఆర్థిక నష్టం కలిగిస్తుందని వెంటనే వాటిని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పార్వతీపురం డివిజన్ కార్యదర్శి ఎంవి చలం డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు గురువారం స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్ ఎదుట ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక బిల్లు 2025లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కేంద్ర పౌర సేవల (పెన్షన్) నిబంధనల సవరణలు మంగళవారం లోక్‌సభలో ఆమోదించబడ్డాయని, రాజ్యసభలో ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకోవాలని చూస్తుందని అన్నారు. ఈ బిల్లుకు నిరసనగా లోక్‌సభలో విపక్షాలు నిరసన తెలిపి వాకౌట్ చేశారని తెలిపారు. ఈ చట్టం లోక్‌సభలో ప్రవేశపెట్టడం, ఆమోదించడం పెన్షనర్ల పట్ల తీవ్రమైన వ్యతిరేక చర్యగానే పెన్షనర్ సంఘాలు దేశవ్యాప్తంగా వ్యతిరేకి స్తున్నాయని అన్నారు. ఇది పెన్షనర్ల హక్కులను హరించడమేనని సంఘ నాయకులు తెలిపారు. దేశవ్యాప్తంగా పెన్షనర్లు అంతా ఐక్యంగా ఉద్యమించి దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్ని శాఖల పెన్షనర్ల సంఘ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.



ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న చలం



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ఏజెన్సీ వద్దు... ఆప్కాసే ముద్దు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ కార్మికులకు సంబంధించి ఏజెన్సీ వద్దు ఆప్కాస్ ముద్దు అన్న నినాదంతో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయంలో ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.పకీరుకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వెంకటరమణ, నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేసిందని, సమ్మెలో భాగంగా అప్పటి ప్రభుత్వం ప్రత్యేక జీవోలు విడుదల చేసిందని అన్నారు. అవి నేటికీ అమలు చేయలేదని, పారిశుధ్య కార్మికులకు 62 ఏళ్ల వయోపరిమితి పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, రిటైరై పని చేస్తూ చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించి పనిలో పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలు పెట్టే ఆలోచన మానుకోవాలని, ఆప్కాస్ విధాన కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని అన్నారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా పని కుదించాలని, కార్మికుల సంఖ్య పెంచాలని అన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ పంటలపై దృష్టి పెట్టాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఆర్గానిక్ పంటలపై దృష్టి పెట్టాలని ఐటిడిఎ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన నాలుగు మండలాల వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు, ఆర్ట్స్, వెలుగు, ఎపిసిఎన్ఎఫ్ సంస్థల ప్రతినిధులతో సమావేశమై ఆర్గానిక్ పంటలపై చర్చించారు. పంటలను ఆర్గానిక్ పద్ధతుల ద్వారా పండించడం వల్ల అధిక ధర వస్తుందన్నారు. సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో జీడిపంటపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి ఆర్గానిక్ ద్వారా పండించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.




గర్భిణులకు అవగాహన కల్పిసుతన్న సూపరిటెండెంట్ శోభారాణి

సాధారణ ప్రసవాలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలపై గురువారం కురుపాం సిహెచ్‌సిలో గర్భిణులకు సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భిణీ పౌష్టికాహారం తీసుకోవాలని, అలా తీసుకోవడం వల్ల రక్త హీనత లేకుండా తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. నొప్పులు వస్తున్నాయని శస్త్ర చికిత్సలకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారని ప్రభుత్వం ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తున్నామని ప్రతి ఒక్క గర్భిణీ సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి వైద్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.



బాలుడుని పాఠశాలలో చేర్పిస్తున్న ఎంఇఒ సూర్యదేవుడు

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలి, ఆర్ వెంకన్నపేట, బూర్జ గ్రామాలలో చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులను బడిలో మూడు, నాలుగు, ఐదో తరగతిలో చేర్పించామని ఎంఇఒ జి.సూర్యదేవుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వెంటనే దగ్గరున్న పాఠశాలలో చేర్పించాలని ఉపాధ్యాయులు, సిఆర్‌పిలకు చెప్పారు. ఇప్పటికే మూడు క్లస్టర్ నుంచి విద్యార్థులను గుర్తించి వెంటనే అక్కడ ఉన్న పాఠశాలల్లో చేర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం.వెంకటరమణ, సిఆర్‌పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు విఆర్‌ఎల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 5న విజయవాడలో గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్ఎ) రాష్ట్ర సదస్సు జరుగుతుందని, ఈ సదస్సుకు జిల్లాలోని విఆర్‌ఎలంతా పాల్గొని జయప్రదం చేయాలని విఆర్‌ఎల సంఘ జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ఏడేళ్లుగా ఒక్క రూపాయి కూడా జీతం పెంచలేదని, గత ప్రభుత్వం తిరిగి తమ వద్ద నుంచి డిఎ రికవరీ చేశారని అన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం తాము వచ్చిన ఒక నెలలో మీ సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ 9 నెలలు అవుతున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని అన్నారు. అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు వారధిగా ఉండి విఆర్ఎ వ్యవస్థను ప్రభుత్వ చిన్నచూపు చూస్తుందన్నారు. విఆర్‌ఎల సమస్యలపై జరిగే భవిష్యత్తు కార్యాచరణ సదస్సుకు జిల్లాలో విఆర్‌ఎలంతా పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలు

ప్రజాశక్తి - భామిని

నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని బత్తిలి ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని మనుమకొండ పంచాయతీ పరిధిలో పాలవలస, మనుమకొండ గ్రామాలలో గురువారం డ్రోన్ కెమెరాలను వినియోగించారు. ఈ సందర్భంగా బత్తిలి పిఎస్ ట్రైనీ ఎస్ఐలకు డ్రోన్‌తో నిఘా, వినియోగంపై శిక్షణ అందించారు. స్వల్ప కాలంలో ఒక ప్రాంతంలో పూర్తి స్థాయి నిఘా పెట్టి నేరాలు నియంత్రణకు, పర్యవేక్షణకి డ్రోన్ కెమెరాలు దోహదం చేస్తాయని తెలిపారు. డ్రోన్ కెమెరాస్ పోలీస్ నిఘా వ్యవస్థని పటిష్టం చేస్తాయన్నారు.

ఎన్యుమరేటర్లకు శిక్షణ

ప్రజాశక్తి- సీతంపేట

మండల కేంద్రంలో మూడవ రోజు గురువారం ఎన్యుమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎం రమణ మాట్లాడుతూ 2025-26 వార్షిక ప్రణాళిక తయారు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. 1252 సంఘాలకు 215 మంది ఎన్యూమరేటర్‌లకు శిక్షణ ఇచ్చామని చెప్పారు. 6వ తేదీ నుంచి చిన్న సంఘాలు, గ్రామ సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసుకొని వార్షిక ప్రణాళిక తయారు చేస్తామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎపిఎం కమలాకుమారి, పార్వతీ, లక్ష్మి సింహాచలం డిపిఎం ఐబి, ఎల్‌హెచ్ ఎపియం, సీసీలు, విఒఎలు పాల్గొన్నారు.

దశమంతపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులు, గర్భిణీలు, చిన్నారులు, మధుమేహ, రక్తపోటు, తదితర రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

సైబర్ నేరాలపై అవగాహన

కురుపాం: మండలంలోని వేగులవాడ, రజ్జిలి, పొడి, సంతోష్‌పురం గిరిజన గ్రామాల్లో గిరిజన ప్రజలకు కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు గురువారం సాయంత్రం సైబర్ నేరాలు, రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరు ఎటువంటి ప్రలోభాలకు నమ్మకుండా మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించి అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి మద్యం సేవించకుండా వాహనాల నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన బంతుల తయారీపై అవగాహన

ప్రజాశక్తి - పాచిపెంట

తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో విత్తన బంతుల ప్రయోగం చాలా ఉపయో గకరంగా ఉంటుం దని, వీటిని తయారు చేసుకుని పొడి దుక్కిలోనే చల్లుకున్నట్లయితే వాతావరణంలో ఉన్న తేమను గ్రహించి విత్తనాలు మొలకెత్తుతాయని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని మాతుమూరులో ప్రకృతి సేద్య ఎల్ వన్ తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో రైతులకు విత్తన బంతుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరావు మాట్లాడుతూ జీవ వైవిధ్యం పెంపొందించడానికి విత్తన బంతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రైతులు విత్తనబంతులు తయారు చేసుకుంటే అదును కోసం ఎదురుచూసే పనిలేదన్నారు. కావున రైతులు శ్రమ అనుకోకుండా ఎలాంటి ఖర్చు లేని విత్తన గుళికలను తయారు చేసుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతులు ఆర్థిక అభివృద్ధి చెందడానికి అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని, ప్రకృతిని పరిరక్షించడానికి ప్రకృతి వ్యవసాయ విధానం చేయడం ఉత్తమమైన మార్గమని, ప్రకృతి వ్యవసాయంతో రైతు ఆర్థికాభివృద్ధి చెందవచ్చునని ప్రకృతి రీజనల్ తిమెటిక్ లీడ్ కె. ప్రకాశ్ అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామం వద్ద రైతు సేవా కేంద్రలలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం, జిల్లాలోని మిగతా వ్యవసాయ అనుబంధ శాఖలు, స్వచ్ఛంద సంస్థలతో అనుసందానంగా గురువారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విధమైన రసాయనికి ఎరువులు- పురుగు మందులు వాడకుండా సహజంగా లభించే వనరులను ఉపయోగించుకొని, తక్కువ పెట్టుబడితో, అవసరమైన సందర్భంలో కషాయాలు ద్రావణాలు తయారు చేసుకుని పంటలపై ఉపయోగించుకోవడం వల్ల బహుళ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. జట్టు వ్యవస్థాపకులు, స్కూల్ సిలబస్ డెవలప్మెంట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి. పారినాయుడు



గరుగుబిల్లి: సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రకాశ్

మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల భూమి సారవంతం కోల్పోవడంతో పాటు ప్రకృతి నష్టపరచడం జరుగుతుందని చెప్పారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్, ఎడిఎ ఏ.నిర్మలదేవి, మండల వ్యవసాయ అధికారి విజయ భారతి, వెలుగు ఎపిఎం అప్పలనాయుడు, స్కూల్ సిలబస్ జూనియర్ కన్సల్టెంట్ టి.శివాజీ, యన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, దేవీ ప్రసాద్, మండల్ ఇన్చార్జ్ వి పోలినాయుడు, పాల్గొన్నారు.

నవధాన్య సాగు - నేల తల్లికి బాగు

సీతానగరం: మండలంలో వ్యవసాయశాఖ - రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య ప్రకతి వ్యవసాయం ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక 2025-2026ను వ్యవసాయ అనుబంధ శాఖలు, వెలుగు శాఖల అధికారులతో ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఆర్‌టిఒ హేమ సుందర్, ఆర్‌టిఎల్ కె.ప్రకాష్ రావు, పిఎఒ కె. శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి ఎస్ అవినాష్, ఉద్యాన అధికారి ప్రత్యూష భాను పాల్గొని మాట్లాడారు. బహుళ పంట విధానాన్ని అమలు చేసుకోవాలని, నవధాన్య సాగుకు వెలుగు సంఘం నుండి ప్రకృతి వ్యవసాయం సిబ్బంది నుంచి రైతులు సహాయం తీసుకోవాలన్నారు. వరి నేరుగా విత్తే పద్ధతిలో పిఎండిఎస్ పద్ధతిలో పెసర, మినుము, ఉలవ చెరో 500 గ్రాములు, బెండ, గోంగూర, నువ్వులు, ముల్లంగి వేసుకోవడం వల్ల భూమి సారం పెరుగుతుందని చెప్పారు. మండలంలో ప్రతి రైతు సేవా కేంద్రంలో నవధాన్య కిట్లు అందుబాటులో ఉన్నాయని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా ఇప్పలపోలమ్మ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో కొలువై ఉన్న ఇప్పలపోలమ్మ గ్రామదేవత 17వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఆ గ్రామ దేవత కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలు పట్టణంలోని పలు వార్డుల్లో గల మహిళలు అమ్మవారి గుడికి చేరుకొని ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గుసిరి కాసిరాజు, గొర్లి వెంకటరమణ, బార్నాల సీతారాం, బెలగాం జయప్రకాష్ నారాయణ, కందుకూరి ప్రభాకర్ రావు, మండల గణపతి, సుంకర ప్రసాద్, తదితరుల పర్యవేక్షణలో ఈ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వార్షికోత్సవ వేడుకల్లో చాలామంది మహిళలు పాల్గొనడం విశేషం ఉత్సవాల అనంతరం భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ప్రజావసరాల మేరకు అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

నియోజవర్గంలో ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. మండలంలో గురువారం జరిగిన పలు ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత గుణద తీలేసు పంచాయతీలోని దిగువ గుణద నుంచి భిన్నిడి, ఎగువ గుణద నుంచి సవర గుణద గ్రామాలకు రూ.4కోట్లు 10లక్షలతో నిర్మించిన బిటి రోడ్డును ఆమె ప్రారంభించారు. అనంతరం ఉలిపిరివలసలోని ప్రాథమిక పాఠశాలకు రూ.12 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ఆమె ప్రారంభించారు. ఉలిపిరి ఆశ్రమ పాఠశాలకు రూ.20 లక్షలతో మంజూరైన పాఠశాల ప్రహరీ గోడకు శంకుస్థాపన చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటిడిఎ ద్వారా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీపై పిఒకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థినులు చక్కగా చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధించి గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థినిలకు మంచి ఆహారంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు, విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం గుణానపురంలో రూ.14 లక్షలతో నిర్మించిన సిసి రహదారి ప్రారంభించి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి

అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలతో ముందుకు వెళ్తుందన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి రహదారి సదుపాయం కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఒక్కొక్క పథకం అందించి అన్నింటినీ నెరవేర్చేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు, వివిధ మండల శాఖ అధికారులు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ శేఖర్‌పాత్రుడు, తెలుగురైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు, పి వెంకటనాయుడు, ఎస్టీ సెల్ నాయకులు తమ్మయ్య, జనసేన కోఆర్డినేటర్ కే. మల్లేష్, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని అంబేద్కర్ జంక్షన్‌లో ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలని కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎస్.సింహాచలం డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో పడివున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించారని, అధికారుల నిర్లక్ష్యం వల్ల రహదారి విస్తరణ అభివృద్ధి పనులు పూర్తయ్యి దాదాపు ఏడాది కావస్తున్నప్పటికీ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించలేదని అన్నారు. విగ్రహాన్ని తొలగించిన చోట ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ మేధావి కోట్లాది మంది, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అయినా అంబేద్కర్ విగ్రహాన్ని పోలీసు స్టేషన్‌లో ఓ పక్కన పడేశారని, ఇదే ఆయనకు ఇచ్చిన గౌరవమని ప్రశ్నించారు. తొలగించిన విగ్రహాన్ని ప్రతిష్టించాలని ఇప్పటికే తహశీల్దార్‌కు ఎంపిడిఒకు వినతిని అందజేశామన్నారు. అయితే వారు ఇంత వరకు ఎలాంటి చర్యలు



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ ప్రధాన జంక్షన్‌కు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జంక్షన్ అనే వారని, ప్రజలతో అంతగా గుర్తింపు పొందిన ఈ ప్రాంతాన్ని అధికారులు గుర్తించకపోవడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళిత సంఘాలను, ప్రజలను ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు కారు మరియన్న, ఎస్.నగేష్, ఎన్.మురళి, కె.బలరాం, పాల్గొన్నారు.

బిసి రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి ఆదినారాయణ, ఎంపిడిఒ టి.కృష్ణారావు ఆధ్వర్యంలో బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా 185 మంది దరఖాస్తులు చేయగా 149 మంది హాజరయ్యారు. ఇంటర్వ్యూలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ వై సత్తిబాబు, గ్రామీణ బ్యాంక్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, కార్యదర్శి బి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండిఒ పి.త్రివిక్రమ్‌రావు మాట్లాడుతూ మండలానికి 108 యూనిట్లు మంజూరయ్యాయని 628 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారని వీరిలో 424 మందిని ఇంటర్వ్యూలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర బ్యాంకు, స్టేట్ బ్యాంకు మేనేజర్లు, మండల పరిషత్ కార్యాలయం ఎఒ ఎంఎస్ఎన్ఎల్ ప్రసాద్, సిబ్బంది ప్రసాద్ రావు, రామినాయుడు వివిధ గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

మక్కువ: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం బిసి రుణాలు కోసం 276 మందిని ఇంటర్వ్యూ చేశామని ఎంపిడిఒ డిడి స్వరూపారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి దేవకుమార్, యూనియన్ బ్యాంక్ మార్కండపుట్టి మేనేజర్, మక్కువ సంబర ఎపిజివిబి మేనేజర్లు, స్టేట్ బ్యాంకు మక్కువ మేనేజరు పాల్గొన్నారు.

కురుపాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం బిసి కార్పొరేషన్ రుణాలకు ఎంపిడిఒ జె.ఉమామహేశ్వర ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 125 మంది రుణాలకు దరఖాస్తు చేసుకోగా 90 మంది మాత్రమే ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారని, వీరందరికీ బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.



సీతంపేట: ఇంటర్వ్యూకు హాజరైన లబ్ధిదారులు

భారీ వాహనాలతో రోడ్లకు తప్పని ముప్ప

ప్రజాశక్తి - సీతంపేట

ఒడిశా నుంచి పరిశ్రమలకు సంబంధించిన యంత్రాలు భారీ వాహనాల ద్వారా సీతంపేట రహదారి మీదుగా తరచుగా వెళ్లడంతో రోడ్లకు, కల్వర్టలకు ముప్పు పొంచి ఉంది. ఇలాంటి భారీ వాహనాలు హైవేలపై వెళ్తే బాగుంటుందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఈ వాహనాల ద్వారా ట్రాఫిక్‌కు కూడా తరచూ అంతరాయం కలుగుతుంది. అలాగే విద్యుత్ తీగలు కూడా తెగిపోతున్నట్టు మండల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు వేసే స్మార్ట్ మీటర్లపై ప్రజలంతా పోరాడాలని సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్‌ఛార్జీలు తగ్గించాలనే గోడపత్రికలను గురువారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బివి రమణ, పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భారాలు వేయబోమని ప్రజలను నమ్మించి నేడు అధికారం వచ్చాక బాదుడే బాదుడుగా అన్ని రకాల నిత్యావసర సరుకులు ధరలు పెంచివేసేలా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతున్న ప్రజలపై సెల్‌ఫోను రీఛార్జ్ వలే స్మార్ట్ కరెంటు మీటర్లు ఇళ్లకు ఏర్పాటు చేసి మరింత ఆర్థిక భారాలు వేసే ప్రయత్నం చేపడుతుందని, ఇది చాలా దుర్మార్గమని మండిపడ్డారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

కావున రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపిన ట్రూఅప్ ఛార్జీలను ఉపసంహరించాలని, సెకీ ఒప్పందాలను రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, పి.రాజశేఖర్, వెన్నెల చిన్నంనాయుడు పాల్గొన్నారు.

వాహనం ద్వారా రేషన్ అందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

అసంపూర్తిగా వదిలేసిన గిరిజన గ్రామాల రహదారులు వెంటనే పూర్తి చేసి రేషన్ బియ్యం ఆయా గ్రామాలకు వాహనం ద్వారా తీసుకెళ్లి అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని చినఖేర్జెల పంచాయతీ సిసాడవలస గ్రామంలో సిపిఎం గిరిజన సంఘం ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ ప్రక్రియను, జీడి తోటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నయా పంచాయతీకి చెందిన సంకేసు నయా గుడ్డం, దేరుపాడు, బట్టిమానువలస, సిశాడవలస గ్రామాలకు గత ప్రభుత్వం



గిరిజనులతో మాట్లాడుతున్న సాంబమూర్తి

కొంతవరకు రోడ్లు వేస్తామని జెసిబితో తవ్వి రాళ్లు వేసి పూర్తిగా వదిలేసిందని చెప్పారు. దీనివల్ల గిరిజన ప్రజలు వాహనాల ద్వారా గాని ఆటోల ద్వారా గాని నడిచి వైద్యం కోసం వివిధ వస్తువులు కొనుక్కోడానికి కొమరాడ మండల కేంద్రానికి చేరుకోవాలంటే చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నేటికీ 9 నెలల అయినా ఈ రహదారుల విషయంలో కనీసం పరిశీలించకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు వేయాలని కోరారు.

కలప బహిరంగ విక్రయం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని సాలూరు ప్రభుత్వ వెదురు విక్రయ డిపోలో 2025-26 సంవత్సరానికి గాను టేకు, నాన్ టేకు కలప, వెదురు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని జిల్లా అటవీ శాఖ అధికారి జిఎపి ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదట, రెండవ వేలం ప్రతిపాదించిన తేదీల్లో కలప విక్రయించడం జరుగుతుందన్నారు. కలప, వెదురు మొదటి వేలాన్ని ఏప్రిల్, మే, జూన్, జూలై, సెప్టెంబర్, అక్టోబర్, డిసెంబరు, వచ్చే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 9న, ఆగస్టు 11న, నవంబర్ 10న, రెండో వేలం ఏప్రిల్, మే, జూన్, నవంబర్, డిసెంబర్, వచ్చే ఫిబ్రవరిలో 21న, జనవరిలో 22న, మార్చిలో 20న కలప, వెదురును సాలూరు ప్రభుత్వ కలపసేల్ డిపోలో విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం పాటలో ఆసక్తిగల వారు పాల్గొనాలని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

డైరీని ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ రూపొందించిన 2025 సంవత్సర డైరీని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం తన కార్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా చేపడుతున్న గృహాలను త్వరితగతిన పూర్తి చేసే గురుతర బాధ్యత ఇంజినీర్లపై ఉందన్నారు. చిత్తశుద్ధితో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపకలెక్టర్, గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి, హౌసింగ్ డిఇఇలు, ఎఇలు, ఎఇలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు 8 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 4 తేదీ నుంచి 6 తేదీ వరకు రాజమండ్రి లో జరగనున్న రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు నెల్లిమర్ల మండలం కొండవెలగాడ జెడ్‌పి హైస్కూలుకు చెందిన 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వి.జ్ఞానశంకర్, పాఠశాల పీడీ పతివాడ శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర పోటీల్లో విజేతలుగా నిలిచి జిల్లా,పాఠశాల ప్రతిష్ఠను ఇనుమడింప చేయాలని కోరారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని రాయగడ రోడ్డులో ఉన్న గోపాల్ దాస్ పేట 11 కె.వి ఫీడర్‌పై ఉన్న ఇందిరా కాలనీ, గంట వీధి, చిన్న మాదిగ వీధి, నిర్మల కాలనీ, దేవాంగుల వారి వీధి, బంధం వారి వీధి, టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు, బరాటం వీధి, కంగటి వీధి, నెయ్యిల వీధి, బోటు వీధి, పాత బస్టాండ్, దంగిడి వీధి, అమ్మి గారి కోనేరు, ఎస్ ఎన్ ఎం నగర్, దుర్గ గుడి రోడ్డు, తూర్పు వీధి, కాకర్ల వీధి, గడి వీధి, కొత్త వీధి, రాయగడ రోడ్, వెంకటేశ్వర కాలనీ, గాసి వీధి, పరమేశ్వరి నగర్, జట్టాశ్రమం, సూర్యా పీఠం వరకు శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఎఇ దివ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అంతరాయానికి స్థానిక ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

పాలకొండ : స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి టౌన్ ఫీడర్‌పై నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ టిజికె మూర్తి తెలిపారు. మండలంలోని ఎన్‌కె రాజపురం, సిఎల్ నాయుడు నగర్, నీలం కాలనీ, ఏరియా హాస్పిటల్, ఎంఎం నగర్, యాత వీధి, వేమకోటి వారి వీధి, రామా కళామందిర్ వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలాగే లుంబురు సబ్ స్టేషన్ పరిధిలో పనుల్ని మొత్తం ఉదయం 10:30 నుండి 11:30 వరకు నిర్వహించనున్నందున గాసి వీధి, కస్పా వీధి, రెల్లి వీధి, దేవర పేట, కోమటిపేట, బోనం వీధి, వెంకంపేట, పెదకాపు వీధి, నెయ్యిల వీధి, లుంబురు వారి వీధులకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు.

లక్ష్మీపురంలో తాగునీటికి కష్టాలు

ప్రజాశక్తి- సీతానగరం

మండలం లోని లక్ష్మీపురం గ్రామంలో జలజీవన్ పథకం ద్వారా ప్రజలకు తాగునీటి కోసం ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసినప్పటికీ, సువర్ణముఖి నది తీరానికి 100 మీటర్ల దూరంలో గల గ్రామంలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు పోయేందుకు ఏర్పాటు చేసిన కాలువలో తాగునీటి పైపులైను ఉండటం వల్ల ఆ నీరునే గ్రామస్తులు కొన్నిచోట్ల పట్టుకోవాల్సిన దుస్థితి దాపురించింది. తాగునీటిలో మురికి నీరు కలిసిపోవడంతో ఆ కలుషిత నీరును తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు పువ్వల రాము, డి, మోహన రావు, శ్రీను తదితరులు కోరారు.



మురుగు కాలువలో పైపు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

నేటితో ముగియనున్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల ఒక అంగన్వాడీ కార్యకర్త, రెండు సహాయకులు, ఒక మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తులకు గడువు నేటితో ముగుస్తుందని, కావున ఆసక్తి గల మహిళలు శుక్రవారం సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని విఆర్ పేటలో ఒసి అంగన్వాడీ కార్యకర్త, సీతంపేటలో ఎస్టీ మినీ అంగన్వాడీ కార్యకర్త, చిన బొండపల్లి - 3లో బిసి-డి అంగన్వాడీ సహాయకురాలు, బలగొదబ-2లో ఎస్సీ అంగన్వాడీ సహాయకులు పోస్టులు ఉన్నాయన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు నిర్దేశించిన కమ్యూనల్ రోస్టర్ రిజిస్టర్ అనుసరించి, కేటగిరీ అభ్యర్థులతో పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందని చెప్పారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం వల్లరిగుడబ గ్రామం రజక వృత్తికి చెందిన పలగ్రర పోలి (40) ఊరిలో ఒక వ్యక్తి మృతి చెందగా దహన సంస్కారాలు చేసి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. నీకు రోజు ఇదే అలవాటు అయిపోతుందని భార్య మందలించడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ విషయం భార్యకు తెలపడంతో వెంటనే అప్రమత్తమై కుటుంబ సభ్యుల సహకారంతో ఆటోలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. చికిత్స పొందుతూ గురువారం వేకువ జామున మృతి చెందాడు. గరుగుబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఔట్ పోస్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.